క్లుప్తంగా...

ఎన్నికల అవగాహన సమావేశం



ఎన్నికల అవగాహన సమావేశంలో చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఎన్నికల అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్ర కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, బీఎల్‌ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడలకు జోనల్ జట్టు ఎంపిక



జిల్లా పోటీలకు ఎంపికైన మేడ్చల్ జోనల్ జట్టు

మేడ్చల్: ఈ నెల 16వ తేదీ నుంచి నిర్వహించే జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు మేడ్చల్ జోనల్ నుంచి పాల్గొనే అండర్–14 జట్టు ఎంపికను పూర్తిచేసినట్లు జోనల్ స్థాయి క్రీడల కార్యదర్శి నాగరాజుగౌడ్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన సెలక్షన్‌లలో క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కీసర ఫారెస్టు భూమిని కాపాడండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసర మండల కేంద్రంలోని 131 సర్వే నంబర్‌లో ఉన్న 105.26 ఎకరాల ఫారెస్ట్ భూమిలోకి కొందరు వ్యక్తులు చొరబడి చెట్లు నరికి భూమిని చదును చేస్తున్నారని జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఈ నెల 9 నుంచి భూకబ్జాదారులు రెండు ఇటాచీలు, ట్రాక్టర్లు పెట్టి ఫారెస్ట్ భూమిలో బ్లాస్టింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బ్లాస్టింగ్ వల్ల ఒక వ్యక్తి తలపై బండరాయి పడి తీవ్రమైన గాయాలైనట్లు తెలిపారు. అయినా పట్టించుకున్నవారే లేరన్నారు. కబ్జాకు గురవుతున్నా ఫారెస్ట్ భూమిని కాపాడలేని అధికారులను విధుల నుంచి తొలగించి, ఆ భూమిని రక్షించాలని వారు కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వైస్ చైర్మన్ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల రాకపోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మేడ్చల్: రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మూడు ప్రభుత్వాలు మారినా మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కాకపోవడం సిగ్గుచేటని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మేడ్చల్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని 2007 నుంచి విద్యార్థులు పోరాటాలు చేస్తున్నా ఏ ఒక్క ఎమ్మెల్యే పట్టించుకోలేదని, గత ఎన్నికల్లో మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మంత్రి మల్లారెడ్డి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని, అవసరమైతే తానే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య కోసం నగరానికి వెళ్లలేక ఉన్నత చదువులకు దూరం అవుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు అరుణ్, శ్యామ్‌రావు, అనిల్, రవి, నికిత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ లేకుంటే.. రేషన్ కట్..



- వేలి ముద్రతో నమోదు తప్పని సరి
- రేషన్ కార్డుల్లో అనర్హుల ఏరివేతపై చర్యలు
- జిల్లాలో మొత్తం 5.24 లక్షల రేషన్ కార్డులు
- సభ్యుల సంఖ్య(యూనిట్లు) 17,20,035

సాక్షి, మేడ్చల్ జిల్లా: మీ కుటుంబానికి రేషన్ కార్డు ఉందా.. ఉంటే అందులో పేర్లు ఉన్న వారందరూ ఒకసారి రేషన్(షాపు) దుకాణానికి వచ్చి వేలిముద్ర వేసి, కేవైసీ(నో యువర్ కస్టమర్) నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ కారణంతోనైనా రాలేకపోయినా, కుటుంబ సభ్యులు చనిపోయినా ఆ మేరకు మీ కార్డులో బియ్యం కోటా తగ్గిపోతోంది. రేషన్ బియ్యం తప్పుదారి పట్టకుండా నివారించడానికి, అర్హులకే రేషన్ బియ్యం అందించడానికి ప్రభుత్వం ఈ చర్యలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా రాయితీలను భరించి పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నాయి. ఆహార భద్రత(రేషన్) కార్డులో పేర్కొన్న సభ్యులు ఒక్కొక్కరికి ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నాయి. కార్డులో పేరున్న ఏ ఒక్క వ్యక్తి చౌక ధరల(రేషన్ షాపు) దుకాణానికి వెళ్లినా సదరు కార్డులో పేర్కొన్న యూనిట్ల ప్రకారం రేషన్ బియ్యం అందిస్తున్నారు.

- రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యుల పేరిటే బియ్యం పంపిణీ చేస్తున్నారు. కొన్ని కార్డుల్లోని కుటుంబ యజమాని లేదా సభ్యులు చనిపోయారు. కూతుళ్లు వివాహాలు చేసుకుని అత్తారింటికి వెళ్లిపోయారు. కుమారులు పెళ్లి చేసుకుని ఉద్యోగం, ఉపాధి పేరిట ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినా కార్డుల్లో పేర్లు అలాగే కొనసాగుతున్నాయి. నిరుపేదల ఆకలి తీర్చేందుకు అందిస్తున్న ప్రజాపంపిణీ బియ్యం.. దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్రతి రేషన్ కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకునేందుకు వారి వేలిముద్రలు సేకరించి కేవైసీ పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రేషన్ కార్డులో పేర్లు ఉన్న ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేసి, కేవైసీ నమోదు చేసుకోవాలని ఆదేశించారు. కేవైసీ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమైంది. కేవలం రేషన్ దుకాణాల్లో మాత్రమే వేలిముద్రలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీలర్లు సైతం తమ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు సమాచారం అందించి ఒకేసారి కుటుంబ సభ్యులంతా వచ్చి వేలిముద్రలు వేసుకుని తమ కేవైసీ పునరుద్ధరించుకునేలా చూడాలని కోరారు.

ఈ-కేవైసీ నమోదు ఇలా..

- రేషన్ కార్డు ఉన్న కుటుంబ యజమానితోపాటు కార్డులో పేర్లు ఉన్న కుటుంబ సభ్యులంతా సమీప చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో వేలిముద్రలు వేయాలి. వేలి ముద్ర వేయగానే రేషన్ కార్డు నంబర్‌తో పాటు సభ్యుల ఆధార్ కార్డు నంబరు చూపిస్తోంది. వీటిని సరి చూసిన తర్వాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల కేవైసీ పునరుద్ధరణ జరుగుతుంది. ఒకవేళ ఈ పాస్ మిషన్‌లో ఎరుపు రంగు వస్తే సదరు వినియోగదారుడి రేషన్ కార్డు, ఆధార్ సరిపోల్చలేమంటూ రిజెక్టు సూచిస్తుంది. దీంతో ఒక(సభ్యుడు) యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగింపునకు గురవుతారు.

రేషన్ కార్డులిలా..

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వివిధ కేటగిరీల వారీగా 5,24,153 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 17,20,035 మంది సభ్యులు(యూనిట్లు) ఉండగా, ప్రతినెలా 10,650.124 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్నారు.

కార్డులో పేరుంటే కేవైసీ తప్పనిసరి

ప్రతి రేషన్ కార్డులోని సభ్యులంతా తమ వేలి ముద్రలు నమోదు చేసుకోవాలి. ఉపాధి, ఇతర పనుల నిమిత్తం వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు తమ సమీపంలోని దుకాణానికి వెళ్లి ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసుకోవచ్చు. డీలర్లకు కూడా ఈ విషయంపై పూర్తి అవగాహన కల్పిస్తాం. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత మార్పులు చేస్తారు. చౌక బియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే అంతా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలి.

- విజయలక్ష్మి, డీఎస్‌ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

అభివృద్ధిలో ఆదర్శవంతంగా మున్సిపాలిటీలు



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి



నారపల్లిలో ఆయుష్మాన్ భారత్ ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి

కీసర: రాష్ట్రంలోని మున్సిపాలిటీలు శరవేగంగా అభివృద్ధి చెందుతూ ఆదర్శవంతంగా ఉన్నాయని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 3వ వార్డు కౌన్సిలర్ గోక కళావతి యాదగిరి ఆధ్వర్యంలో సాయిదుర్గ రెసిడెన్సీ, గోకుల్ నగర్, డీఎస్‌ఆర్ కాలనీ, తారక ఎంక్లేవ్‌కు చెందిన సుమారు 300 మంది కాలనీ అసోసియేషన్ సంఘ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో చైర్మన్ కె.చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు నాగేష్ గౌడ్, శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాగారం మున్సిపల్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీను, ప్రధాన కార్యదర్శి మచ్చ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ అరిగె రాములు, రైతు సహకార సంఘ డైరెక్టర్ కంసాని మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా రైతు సమన్వయ సమితి డైరెక్టర్ డైరెక్టర్ అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంటలో కుట్టు మిషన్లు పంపిణీ..

గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల శాఖ నిర్వహణలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు మంత్రి మల్లారెడ్డి మిషన్లు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి బి.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో మెరుగైన వైద్యం

పోచారం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య మేళాలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. మందులు కూడా ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు బాలగోని వెంకటేశ్ గౌడ్, సుధాలక్ష్మి, పోచమ్మ, రవీందర్, సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, డాక్టర్లు నారాయణరావు, శోభన తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సీఆర్‌పీఎఫ్ విద్యార్థుల ఉత్తమ ప్రదర్శన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అపర్ణ

జవహర్‌నగర్: తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో ఈ నెల 10న నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో జవహర్‌నగర్ సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి పతకాలు సాధించడం అభినందనీయమని పాఠశాల ప్రిన్సిపల్ డి.అపర్ణ అన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడల్లో కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్ సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆకాజీకుమార్, కిషోర్‌కుమార్, వెంకటరాజు, ఈశ్వర్‌రావు, చంద్రశేఖర్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు జరగనివ్వొద్దు

డీఈఓ విజయకుమారికి వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: బదిలీలు, పదోన్నతుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విఠల్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాధికారి ఐ.విజయకుమారికి వారు వినతి పత్రం అందజేశారు. ప్రిఫరెన్షియల్ సర్టిఫికెట్లు సమర్పించిన వారిని జిల్లా వైద్యాధికారి సమక్షంలో మరోసారి పరీక్షించాలని సూచించారు. స్పౌజ్ పాయింట్లు ఉపయోగించిన ఉపాధ్యాయులు 2018 ట్రాన్స్‌ఫర్‌లో భర్త/భార్య ఉపయోగించుకున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. స్పౌజ్ ఉపయోగించుకున్న వారు ఖచ్చితంగా స్పౌజ్ మండలంలోనే ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌బాబు, శివకృష్ణ పాల్గొన్నారు.

నిమజ్జనం ఏర్పాట్లపై అడిషనల్ డీసీపీ ఆరా



మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ తదితరులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ మినీ ట్యాంక్‌బండ్‌ను మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీసీ నరేశ్‌రెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి పారుదల, రోడ్లు, భవనాల శాఖ, వైద్యశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. వినాయకుల ఎత్తు, సంఖ్య, చెరువు లోతు, లైట్ల ఏర్పాట్లపై చర్చించారు. తహసీల్దార్ కృష్ణ, పోచారం కమిషనర్ వేమనరెడ్డి, సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు, రోడ్లు భవనాలు శాఖ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ సురేశ్, శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



ఘట్‌కేసర్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీజేఎస్ రాష్ట్ర నాయకుడు మారెం లక్ష్మారెడ్డి విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర అధ్యక్షతన చేపట్టిన నిరవధిక సమ్మెకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. నాయకులు కరుణాకుమారి, సబిత, చంద్రమోహన్, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, పద్మ, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీ చేసిన డ్రైవర్ అరెస్టు

ఘట్‌కేసర్: గుట్టుచప్పుడు కాకుండా ట్యాంకర్ నుంచి డీజిల్ చోరీ చేస్తున్న ట్యాంకర్ డ్రైవర్‌ను మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేసి ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించారు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చెర్లపల్లి ఐఓసీ కేంద్రం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ట్యాంకర్‌లో విమానంలో వాడేందుకు పదివేల లీటర్ల ఇంధనం నింపుకున్నారు. ట్యాంకర్ ఘట్‌కేసర్ పట్టణంలోని యాంనంపేట్ చౌరస్తా వద్దకు రాగనే డ్రైవర్ రామలింగం(35)ట్యాంకర్ నుంచి ఇంధనం దొంగిలిస్తుండగా మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. అతడిని విచారించగా డ్రైవర్ రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన రామలింగంగా గుర్తించారు. డ్రైవర్ రామలింగంను రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమ నిర్మాణాలపై సీరియస్

- జీపీల్లో వందలాది అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు
- 16 నుంచి చీర్యాలలో కూల్చివేతలు షురూ..
- భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గుర్తించిన అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై గ్రామ కార్యదర్శులు, పురపాలక కమిషనర్ల నుంచి నివేదిక తెప్పించుకున్న అధికార వర్గాలు చర్యలకు సిద్ధమవుతోంది. కీసర మండలం చీర్యాలలో ఎలాంటి అనుమతులు పొందకుండా.. ఏదాది కాలంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను గుర్తించిన గ్రామ పంచాయతీ యంత్రాంగం ఇప్పటికే 25 అక్రమ నిర్మాణాలను ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూల్చివేసింది. మిగిలిన 30 అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు ఈ నెల 16 నుంచి హెచ్‌ఎండీఏ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపుతోంది. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసుల సహకారాన్ని కూడా కోరినట్లు తెలుస్తోంది. అలాగే, ఇదే మండలంలోని గోధుమకుంట, రాంపల్లి దాయర, కీసర గ్రామాలతో పాటు ఘట్‌కేసర్ మండలంలోని కాచివానిసింగారం, ప్రతాపసింగారం, చౌదరిగూడ, కొర్రెముల, ఏదులాబాద్, అవుషాపూర్, అంకుషాపూర్‌లలో కూడా అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు ఉన్నట్లు గుర్తించిన యంత్రాంగం చర్యలకు ఉపక్రమిస్తోంది. జిల్లాలో గ్రామ పంచాయతీల్లో మండలాల వారిగా కీసర మండలంలో 26, శామీర్‌పేట్ మండలంలో 25, మేడ్చల్‌లో 22, ఘట్‌కేసర్ మండలంలో 13, మూడు చింతలపల్లి మండలంలో 10 అక్రమ లేఅవుట్లు ఉండగా, వందలాదిగా అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు కలెక్టర్‌కు నివేదించిన జాబితాలో సంబంధిత అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై చర్యలు తీసుకోవాల్సిన కొంత మంది ఉద్యోగులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై కూడా జిల్లా యంత్రాంగం సీరియస్‌గా ఉంది. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై సమగ్రమైన నివేదిక అందజేయని గ్రామ కార్యదర్శులు, ఎంపీఓలపై కూడా చర్యలపై ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

మంత్రి మల్లారెడ్డికి టికెట్ ఇస్తే ఓడిస్తాం

ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నక్కా ప్రభాకర్‌గౌడ్

శామీర్‌పేట్:మంత్రి చామకూర మల్లారెడ్డికి బీఆర్‌ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే ఓడిస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నక్కా ప్రభాకర్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేటలోని తన ఫాం హౌజ్‌లో తన అభిమానులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కా ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. మేడ్చల్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అనేక కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిజమైన ఉద్యమకారులను అనిచివేసి, తన అనుచరులకు పదవులు అంటగడుతున్నారని ధ్వజమెత్తారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో చెరువులు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లకు పడగలెత్తారన్నారు. సీఎం కేసీఆర్ స్పందించి స్థానికులకు మేడ్చల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని, లేనిపక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మల్లారెడ్డిని ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశానికి మేడ్చల్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సాధారణ సర్వసభ్య సమావేశం



మూడుచింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట్: మూడు నెలలకోసారి జరిగే మండల సాధారణ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. బుధవారం మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ హారిక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు గ్రామాల్లోని పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని, సమస్యను దృష్టికి తీసుకెళ్లినా మిషన్ భగీరథ అధికారులు స్పందించడం లేదని నారాయణపూర్ సర్పంచ్ రాంయంద్రయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్లు ఆర్టీసీ బస్సులను స్టాపుల్లో నిలపకుండా ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొల్తూర్ సర్పంచ్ శిల్ప సభలో ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. లో ఓల్టేజీ, ధ్వంసమైన విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించడంలో ఆ శాఖ అధికారులు విఫలమవుతున్నారని లక్ష్మాపూర్ సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీఓ వత్సలదేవి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వాణిరెడ్డి, పలువురు అధికారులు, ఎంపీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కార్మికులను రెగ్యులరైజ్ చేయండి



మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో కొంతకాలంగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతిని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే కార్మికులకు ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్నో కంపెనీలను తీసుకువచ్చి ఉపాధి కల్పించారన్నారు. డంపింగ్‌యార్డు యాజమాన్యంతో చర్చించి రెగ్యులరైజ్ అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లపు రవి, గొడుగు వేణు, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కార్మికులు రాములు, ప్రభాకర్, ఆంజనేయులు, నర్సింహరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఎస్‌జీఎఫ్‌ఐ జోన్ క్రీడలు



ఘట్‌కేసర్‌లో బహుమతులు అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఘట్‌కేసర్, మేడిపల్లి మండల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అండర్–14, 17 బాలబాలికల ఎస్‌జీఎఫ్‌ఐ జోన్ క్రీడలు బుధవారం ఘనంగా ముగిశాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అంశాల్లో పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల కార్యదర్శి వినోద్‌కుమార్, కౌన్సిలర్లు శశికళ, మల్లేశ్, నాయకులు జంగయ్యయాదవ్, సురేశ్, ఘట్‌కేసర్ జోన్ సెక్రటరీ శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, లక్ష్మి, అనిత, యాదలక్ష్మి, మల్లేశ్‌ముదిరాజ్, విజయ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న కార్పొరేటర్ మేక లలితాయాదవ్, న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బుధవారం కార్పొరేటర్ మేక లలితాయాదవ్ చేతులమీదుగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వయంశక్తితో ఎదిగి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసి అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. మహిళ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ రాజిరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య, నోడల్ అధికారి వెంకట్, బీఆర్‌ఎస్ నాయకులు చింత పరమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.